# అపోహ

**కె. వాసవదత్త రమణ**

రాత్రి ఎనిమిదయ్యింది. చలికాలం కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. అప్పుడే బస్సు దిగిన నేను ఇంటికి త్వరగా వెళదామని తొందరలో ఉన్నాను. చీకటి పడటంతో తెలియని భయం నన్ను నీడలా వెంటాడింది.

అదే పగలు అయితే ఆగాపురా నుంచి సీతారాంబాగు నడుచుకుంటూ వెళ్లిపోతాను. కాని రాత్రయితేనే భయంగా అనిపిస్తుంది. రెండు-మూడు ఆటోలు ఆగి ఉన్నాయి స్టాండులో. గబగబ నడిచాను వాటి వైపు!

“సీతారాంబాగ్, నై ఆతే! ” కేర్‌లెస్‌గా అన్నాడొకడు.

“సిటి కో జానే కా హై !” ఇంకో ఆటోవాలా తల తిప్పుకున్నాడు.

“అయిదు రూపాయలు ఎక్స్‌ట్రా ఇస్తాను!” బతిమాలినా వాళ్ళకు కనికరం కలగలేదు. ఇక తప్పదనుకుని అలాగే ఆలోచిస్తూ నడుస్తున్నాను. ఇంతలో ఎవరో ముస్లిం యువతి నన్ను తోసుకుంటూ ముందుకు వెళ్లింది.

అసలే భయంతో నడుస్తున్న నాకు కంగారు, వణుకు వచ్చాయి. “ఏం కళ్లు కనపడటం లేదా?” తేరుకొని గద్దించాను. ఆమెకు అర్థం అయిందో అవలేదో, నేను చెప్పింది వినపడిందో లేదో తెలియలేదు కాని పట్టించుకోనట్టు ముందుకు నడిచి వెళ్లిపోయింది.

గబగబా ఏవో సినిమాల్లో సంఘటనలు నా కళ్ల ముందు రీలులా తిరిగాయి. ఒళ్లు జల్లుమంది ఒక్కసారిగా! నా చేతికున్న గడియారం, ఉంగరం, గాజులు అన్నీ సరిచూసుకున్నాను. హాండ్ బాగ్ జిప్ తడిమి చూసుకున్నాను. జిప్ వేసే ఉంది. కొద్దిగా ఊపిరి పీల్చుకున్నాను.

‘అమ్మో, మెళ్లో గొలుసు! మనస్సు ప్రశ్నతో ఉలిక్కిపడి మెడ తడిమాను. గొలుసు చల్లగా తగిలింది, చేతికి!

“అమ్మయ్య!” నిట్టూర్చాను.

ఆమె ఎటు వెళ్లిందో పరిశీలించాను. ముందుకు గబగబా హడావుడిగా నడుస్తోంది.

ఆమెకు కాస్త వెనగ్గా పరిశీలిస్తూ చుట్టూ చూసుకుంటూ బోయిగూడా కమాన్ వరకు వచ్చాను.

అప్పటి వరకు షాపులు, లైట్లు, జనాలు -అంతగా భయం లేకుండా నడవచ్చు.

ఇక ఈ చౌరస్తా దాటితే భయమే. ఇక్కడి నుండి ఒక్క లైటు కూడా ఉండదు, ఉన్నా వెలగదు. సన్నని రోడ్డు. అటు ఇటు పూర్వం రాజులు కట్టించిన పెద్ద గోడలు ఉన్నాయి. ఆ రెండు గోడల మధ్య నుంచి వెళితే మా సీతారాంబాగు వస్తుంది. జనసంచారం తక్కువ. పైగా కటిక చీకటి!

ఆఫీసులో లేటుగా కూర్చునందుకు నన్ను నేను తిట్టుకుంటూ ఏదన్నా ఆటో కనపడితే ఇరవై రూపాయిలైనా ఇచ్చేదాం అనుకున్నాను దృఢంగా. ఎక్కడా వాహనం లేదు. ఏం చేద్దాం? నాలో ఆందోళన మొదలైంది.

ముందు వెళుతున్న యువతి బురఖా లోంచి రెండ్యూమూడుసార్లు వెనక్కి చూసింది.

నాకు బి.పి. పెరగసాగింది.

‘ఇంతకు ముందే రాసుకుంటూ, తోసుకుంటూ వెళ్లింది. ఇప్పుడు చీకట్లో ఆ బురఖాలోంచి ఏ కత్తో చూపి బెదిరిస్తే?’



ఇక కదలకుండా అలాగే నిలబడిపోయాను. ఇటు అటు చూస్తూ, ఆ చౌరస్తాలో.

ఆమె కూడా నడక ఆపేసి నా పక్కగా వచ్చి నిలబడింది.

నా పై ప్రాణాలు ఎగిరిపోయాయి.

“మీరు ఎటు పోవాలి?” పలకరించింది. యాసగా

“నీకెందుకు?” విసురుగా అందామనుకున్నాను కాని మాట పెగిలి రాలేదు గొంతు లోంచి!

మళ్లీ తనే అంది, “నేను సీతారాంబాగు దాటి మల్లేపల్లి పోవాలి, ఎంత సేపు నిలబడినా బస్సు రాలేదు. మా నాన్నకి మందు బిళ్లలు తీసుకెళుతున్నాను. మీరు అటు వైపు అయితే ఇద్దరం నడుచుకుంటూ పోదాం ఒకళ్ళ కొకళ్లం తోడుగా!”

నాకు ఎంత మాత్రం ఆమె మాటలు నమ్మశక్యంగా అనిపించడం లేదు.

“ఇందాక వస్తుంటే, బద్మాష్‌గాడు ఒకడు సైకిల్ మీద పోతూ నన్ను రాసుకుంటూ వెకిలిగా నవ్వుతూ పోయాడు. అందుకే ఈ సందులో పోవాలంటే కొంచెం పరేషాన్ అవుతోంది. ఆ చీకట్లో నడుకుచుంటూ పోవాలంటే కొంచెం భయంగా ఉంది” అంటూ తన కళ్లజోడు తీసి తుడుచుకుంది.

ఆమె ముఖం వంక చూసి ఉలిక్కిపడ్డాను. ఆమెకు ఎడమ కన్ను లేదు. కుడి కన్ను ఒకటే ఉంది.

ఆమె ప్రవర్తన ఆలోచిస్తూంటే, ఆమె కన్ను కనపడకే నన్ను రాసుకుంటూ వెళ్లిందా?

తనూ నాలాగే భయంతో తోడు వెతుక్కుంటోంది. నాకు చెంప చెళ్లుమన్నట్లయ్యింది.

తను నాలాగే ఒక ప్రాణి, నాకున్నట్లే తనకీ మనస్సుంది, తనకీ స్పందనుంది, తనకీ భయముంది. సాటి మనిషి మీద నమ్మకం పోగొట్టుకొని ఏదో సాధించామని విర్రవీగుతున్నాము



అంతరిక్షాల్లో హాయిగా విహరిస్తున్నము. సముద్రాల్లో విలాసంగా ప్రయాణాలు చేస్తున్నాం.

శాటిలైట్లు పంపుతూన్నాము. ఎక్కడో ఖండాంతరాల్లో ఉన్న వ్యక్తికి మన ముందు టీవీల్లో వీక్షించ గలుగుతున్నాము, క్షణాల్లో!

అనుక్షణం భయంతో, అపనమ్మకాలతో ముందు తరాల

# కీటకగణం

గోవిందరాజు రామకృష్ణారావు



కనకాచలం ఇల్లు దేవిడీలా వుంటుంది. అందులో అద్దెకిచ్చిన పన్నెండు వాటాలు. ఏ వాటా కా వాటాలో కావలసిన సదుపాయలున్నాయి. ఒకరితో ఒకరికి సంబంధం వుండదు.

అయితే మధ్యభాగంలో వుండే శారదాంబకీ, పార్వతికీ మాత్రం అన్ని వాటాల తప్పేళ్లు కావాలి. ఇద్దరి మధ్య చాలా పొంతన వుంది. ఇద్దరి పిల్లలూ ఒకే స్కూల్లో చదువుతున్నారు. ఇద్దరు భర్తలూ పని చేసేది ఒకే ఆఫీసు. పొద్దున పది గంటలు మొదలు, సాయంత్రం పిల్లలు బడి నుంచి వచ్చేవరకు, వీళ్లిద్దరూ ఉబుసుపోక కోసం రకరకాల వ్యాపకాలు పెట్టుకుంటారు. అందులో ముఖ్యమైంది తక్కిన పది వాటాల్లో వుండే కుటుంబాల ఆరాలు తీయడం, ఎక్కడ చీమ చిటుక్కుమన్నా ముందుగా తెలుసుకోవడం. ప్రతిదానికీ వంకలు పెట్టి వెక్కిరింపుగా మాట్లాడడం ఈ ఇద్దరి నైజం.

క్రితం రోజు ఖాళీగా ఉన్న ఎడం వైపు చివరి వాటాలో తెల్లవారేసరికి ఎవరో వున్న సంగతి తెలిసి ఇద్దరి గుండె ఆగినంత పనయింది. తమకు తెలియకుండానే ఒక వాటాలోకి ఎవరో వచ్చి దిగడం కంటే తలవంపులు వుండదాయె! కొండంత అవమానాన్ని పది గంటల వరకు ఎలాగో దిగమింగుకుని ఇంటి పనులు చేసుకొని, పిల్లల్ని స్కూలుకీ, భర్తల్ని ఆఫీసుకీ పంపి, పెద్దగా నిట్టూర్చి ముందు కార్యక్రమం ఆలోచించారు.

తమంతట తామే వెళ్లి పలకరించడం ఇద్దరికీ చిన్నతనం అనిపించింది. పైగా ఆ వాటాలో దిగినవాళ్లు ఎలాంటి 'సరుకో' అని పార్వతి ధర్మసందేహం బయటపెట్టింది. సరిగ్గా అలాంటి శంకే శారదాంబ బుర్రనూ తొలిచేయసాగింది.



లాభం లేదని వెంటనే కార్యరంగంలోకి దిగారు. ఏదో పని వున్నట్లు అటుగా వెళ్లి పక్క వాటా ఇల్లాలితో బాతాఖానీ వేసి, చివరి వాటా ద్వారం పైనే నిఘా వేశారు. కాసేపటి వరకు ఆ వాటా లోంచి ఎవరూ బయటికి రాలేదు. ఇద్దరిలో సహనం చచ్చిపోతోంది. ఇంతలో ఆ వాటా లోంచి వయసులో వున్న ఒక ఆడపిల్ల అదరాబాదరాగా తలుపు దగ్గరగా వేసి బయటికి వెళ్లింది. నఖశిఖ పర్యంతం పరీక్షించిన పార్వతి, సైగ చేసింది శారదాంబకి. ఆ వాలకం చూడమని. ఇద్దరి కళ్లూ తాము అనుకున్నది యథార్థమని చెప్తున్నాయి.

పెళ్లి, పెటాకులూ అయినట్లులేదు. మగవాళ్లెవరూ లేరల్లే వుంది. ఇది పెద్ద సరకులానే వుంది.

కనకాచలానికి నిజంగా బుద్ధి లేదు. పార్వతి గొంతు అణుచుకుని, శారదాంబ చెవిలో వూదింది.

అవునన్నట్లు పార్వతి తలూపింది.

అక్కణ్నుంచి వారికి కదల బుద్ధి కాలేదు. ఆ వాటా ఇల్లాలితో ఏదో పిచ్చాపాటీ సాగిస్తున్నారు.

మరి కాసేపట్లో ఆ అమ్మాయి తలుపు తీసి లోనికి వెళ్లింది. వెనకాలే ఒక యువకుడు లోపలికి వెళ్లాడు.

పార్వతి, శారదాంబ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ఇది బరి తెగించిన బాపతు. ఇలా వదలకూడదు."

పార్వతి శారదాంబ చెవులు కొరికింది.

ఇద్దరూ ఆ చివరి వాటాలోకి దూసుకువెళ్లారు.

"రండి పిన్నిగార్లూ!" ఆ అమ్మాయి మర్యాదగా ఆహ్వానించింది.

"ఏ వూరమ్మా మీది? ఎప్పుడొచ్చారు? ఈ వాటాలోకి? చదువా ఉద్యోగమా?" శారదాంబ ఆగలేక ప్రశ్నల వర్షం కురిపించింది.

ఆ అమ్మాయి బేజారెత్తిపోతుందని వాళ్లు వూహించారు. కాని ఆ అమ్మాయి ముఖంలో అలాంటిదేమీ కనిపించలేదు.

"మాది రంగాపురమండి. మా నాన్నకి ఉన్నట్లుండి పక్షవాతం వచ్చింది. రాత్రే ఆసుపత్రిలో చేర్పించాం. దగ్గరగా వుంటుందని ఈ వాటా తీసుకున్నాం. మా అమ్మలేదు. నేనూ, మా అన్నయ్యా వచ్చాం. ఈ వాటాని మా పెదనాన్న కొడుకు కుదిర్చాడు. ఇక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. మీవంటివారి సహాయం మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. మీరిలా వచ్చి పలకరించడమే మీ మంచితనానికి నిదర్శనం" అని ఆ అమ్మాయి చెప్పింది.

శారదాంబ, పార్వతి తెల్లమొహం వేశారు.

"అలాగా! మాకు పనుంది, వస్తాం" ఈసడింపుగా అని, నిరుత్సాహంతో బయటపడ్డారు, మరో వ్యాపకం వెతికేందుకు.

---

కన్నా ఎంతో సుఖంగా, సౌఖ్యంగా జీవిస్తున్నట్లు భ్రమల్లో బతుకుతున్నాము.

ఛీ! ఇదేం బతుకు ! నా మీద నాకే సిగ్గేసింది. నేను చదివిన చదువు బతుకు మీద భయం తప్ప, సాగి మనిషిని మనిషిగా గుర్తించలేని గుడ్డితనాన్ని తప్ప. ఇంకేం ఇవ్వలేదా. ఇవ్వదా?

ఆమె నా వంక వింతగా చూస్తోంది, ఏమ మాట్లాడదే ఈ చదువుకున్న బొమ్మ అని.

ఆమె చేయి పట్టుకొని స్నేహంగా నొక్కి, "రా, ఇద్దరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ నడిచే పోదాం" అన్నాను మనస్ఫూర్తిగా.

ఏ బద్మాష్ గాడు, భయం లేదు!" మనసారా నవ్వుతూ అన్నాను, నాలోని చీకట్లు భయాన్ని విసిరి పారేస్తూ!

ఆమె ఒంటి కంటిలో మతాబులు, ఆమె మనస్సులో స్నేహభావం!!

నాలో వెలుగుతున్న నిర్భయాలతో, నిజాయితీతో ముందుకు నడిచాను ధైర్యంగా, ఆమె చేయి పట్టుకొని!!!